క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమ్మగూడ, రాగన్నగూడ, మన్నెగూడ, ఎంఎం.కుంట, తుర్కయంజాల్‌లోని శోభానగర్, ఏవీ నగర్, శ్రీరామ్‌నగర్, జనప్రియ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు ఇంజాపూర్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఇంజాపూర్ గ్రామం, సీఆర్‌పీఎఫ్ కాలనీ, ఆపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీతో పాటు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఈజీఎస్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మంజుల

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చింతలపల్లిలో మంగళవారం ఈజీఎస్ పనులను సర్పంచ్ మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. కూలీలకు తప్పనిసరిగా ఉపాధి పనులు కల్పించాలని, చేసిన పనులకు సకాలంలో కూలీ అందించాలని అధికారులను కోరారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారికి పని ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శివకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రాములు, స్థానికులు యాదయ్య, రాములు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ అనసూయ, ఉపాధ్యాయులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ వాల్ క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కృష్ణయ్య సంయుక్త కార్యదర్శి పర్వతాలు, లెక్చరర్లు జైపాల్, నాగమణి, వెంకటయ్య, అలివేలు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి నివాళి

మాడ్గుల: మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు జెల్ల తానయ్యగౌడ్ మంగళవారం మృతిచెందాడు. గ్రామంలో వారి కుటుంబ సభ్యులను కల్వకుర్తి నియోజకవర్గ గౌడసంఘం అధ్యక్షుడు ల్లాజీగౌడ్ పరామర్శించారు. తానయ్యగౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి గౌడసంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. గీత కార్మికుల సేవలు ఎనలేనివన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొత్త పాండుగౌడ్, మండల గౌడసంఘం అధ్యక్షుడు నర్సింహగౌడ్, గ్రామ సంఘం అధ్యక్షులు కృష్ణయ్యగౌడ్, నాయకులు గంగారవి, యాదయ్య, వెంకట్‌నారాయణగౌడ్, మల్లేశ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, మహేశ్‌గౌడ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించాలి

ఆర్డీఓ అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంతరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఓటరు జాబితాలో తప్పులను సవరించడంతో పాటు చనిపోయిన వారి పేర్లను తొలగిస్తూ జాబితాను బూత్ స్థాయి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ రవీందర్ దత్, డిప్యూటీ తహసీల్దార్ రామృష్ణతో కలిసి ఆర్డీఓ పాల్గొన్నారు. ప్రతి ఓటర్ వివరాలను పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా బీఎల్‌ఓలు పరిశీలించాలన్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన

- ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- పంచాయతీలకు ప్రత్యేకాధికారుల నియామకం!
- జాబితాను సిద్ధం చేసిన అధికారులు
- పదవీకాలం పొడిగించాలంటున్న సర్పంచ్‌లు



మేడిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆమనగల్లు: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన రానుంది. ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా వారి పదవీకాలం పొడిగించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈమేరకు జిల్లా అధికారుల సూచనల మేరకు మండలాధికారులు ప్రత్యేకాధికారుల జాబితాను రూపొందించి పంపించారు. ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే ప్రత్యేకాధికారుల వివరాలను వెల్లడించనున్నారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాతే..

సర్పంచ్‌ల ఎన్నికలు పార్లమెంటు ఎన్నికల తర్వాతే జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడటం.. తక్కువ సమయం ఉండటంతో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కావడం లేదు. పార్లమెంటు ఎన్నికల తరువాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించడానికి ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

102 గ్రామ పంచాయతీలు

కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలల్లో 102 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆమనగల్లులో 13 గ్రామ పంచాయతీలు, మాడ్గులలో 33 గ్రామ పంచాయతీలు, తలకొండపల్లిలో 32 గ్రామ పంచాయతీలు, కడ్తాలలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించనున్నారు. వీటిలో మధ్యరకం, చిన్న పంచాయతీలను బట్టి అధికారులను నియమిస్తున్నారు.

ప్రత్యేకాధికారులు వీరే..!

ప్రత్యేక అధికారుల నియామకంలో ఎమర్జెన్సీ విధులు నిర్వహించే వైద్య, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ తదితర శాఖలకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిసింది. మండల స్థాయిలో పనిచేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, వ్యవసాయాధికారి, ఏఈఓలు, వివిధ పాఠశాలల గెజిటెడ్ హెడ్‌మాస్టర్లకు ప్రత్యేకాధికారుల బాధ్యతలను అప్పగించనున్నారు. ప్రభుత్వం నుంచి రెండుమూడు రోజుల్లో ఆదేశాలు రాగానే ప్రత్యేకాధికారులను నియమించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మళ్లీ ఎన్నికలను నిర్వహించే వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులే బాధ్యతలు నిర్వహించనున్నారు.

సర్పంచ్‌ల ఆందోళన..

పదవీకాలం ముగుస్తుండటంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. తమ పదవీకాలాన్ని పొడిగించాలని వారు అభ్యర్థిస్తున్నారు. సర్పంచ్‌లుగా గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి తమకు బిల్లులు రావాల్సి ఉందని సర్పంచ్‌లు అంటున్నారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశామని అయినప్పటికీ బిల్లులు మాత్రం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేసినా గుర్తింపు లేదని, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన తమ పదవీకాలం ముగుస్తుండటం, బిల్లులు రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి



సర్పంచ్‌గా రాంనుంతల గ్రామంలో ముఖ్యమైన బ్రిడ్జిని నిర్మించి ప్రజల ఇబ్బందులు తీర్చాం. అప్పులు చేసి అభివృద్ధి పనులను చేపట్టాం. రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మించడం జరిగింది. రూ.20 లక్షలతో పాటు మరో రూ.6 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించి ఇబ్బందులు తీర్చాలి.

– సోన శ్రీనునాయక్, సర్పంచ్, రాంనుంతల

పదవీకాలాన్ని పొడిగించాలి



సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలి. నా హయాంలో ప్రభుత్వాదేశాల మేరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అనేక పనులకు సంబంధించి ఇప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కరోనా సమయంలో సర్పంచ్‌లు ప్రజలకు అన్నివిధాల సేవలను అందించారు. లాక్‌డౌన్, పెండింగ్ బిల్లులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సర్పంచ్‌ల పదవీకాలాన్ని పొడిగించాలి.

– ఎగిరిశెట్టి గోదాదేవి, సర్పంచ్, శెట్టిపల్లి

అధికారుల జాబితా సిద్ధం



గ్రామాలకు ప్రత్యేకాధికారుల జాబితాను సిద్ధం చేశాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నాం. ఇందుకు సంబంధించి అధికారుల వివరాలు, వారి హోదా, వారి సెల్‌నెంబర్ తదితర వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వాదేశాలు రాగానే అధికారుల జాబితాను ప్రకటిస్తాం.

– రాఘవులు, ఎంపీడీఓ, మాడ్గుల

గాంధీ ఆశయ సాధనకు కృషి

వర్ధంతి కార్యక్రమంలో నేతలు



ఆమనగల్లు: గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రామ్మోహన్, నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, నాయకులు శ్రీనివాస్, రాము, వీరేందర్ గుప్తా, చంద్రయ్య గుప్తా, మోహన్‌గుప్తా సత్యానారాయణగుప్తా, నారాయణగుప్తా, రాముగుప్తా తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బల్‌రాం, ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, యాదయ్య, రాము, నర్సింహ, మల్లేశ్, రాజు, డా.శ్రీనివాస్, శ్రీను, సాయి, సురేశ్, సుధాకర్, రమేశ్, యాదగిరి, విష్ణువర్ధన్, వెంకటేశ్, పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రంలో మంగళవారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. మొండిగౌరెల్లిని అంబేడ్కర్ చౌరాస్తాలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సంతోష్‌గుప్త, మురళీకృష్ణ, తడకమల్ల లక్ష్మణ్, ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: నివాళులర్పిస్తున్న వెంకటేశ్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆర్టీసీ బస్టాండ్ పనులు ప్రారంభం



నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కడ్తాల్: గత నాలుగున్నర సంవత్సరాలుగా కడ్తాల్ మండలాన్ని అన్నిరంగాల్లో ప్రగతి పథంలో నిలిపేందుకు నిరంతరం కృషిచేశానని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో ఆర్టీసీ బస్‌స్టాండ్ నిర్మాణ పనులకు సర్పంచ్ సుగుణసాయిలు, వైస్‌ఎంపీపీ ఆనంద్‌తో కలిసి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన భిక్షపతి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, ఎంపీటీసీ ఉమావతి, ఉప సర్పంచ్ ముత్యాలు, స్థానిక నాయకులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల సత్తా

అబ్దుల్లాపూర్‌మెట్: వరల్డ్ నకయామా షాటోకాన్ కరాటే సంస్థ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన సెకెండ్ ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2023–24లో జాఫర్‌గూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కటాస్ వ్యక్తిగత విభాగంలో డీపీఎస్ నుంచి పాల్గొన్న పదిమంది విద్యార్థులు తమ పంచ్ పవర్ చూపించి 10 పతకాలు ఒడిసిపట్టారు. ఇందులో మూడు గోల్డ్ మెడల్స్ ఉండగా ఆరు సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్‌ని సొంతం చేసుకున్నారని ప్రోచాన్స్‌లర్ ముత్తంశెట్టి విజయనిర్మల, సెక్రటరీ కృష్ణారావు, సీఈఓ ముత్తంశెట్టి అఖిల తెలిపారు. వారిని మంగళవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు

మంగళపల్లి వివాదాస్పద భూమిని పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: వివాదాస్పద భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ అన్వర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని మంగళ్‌పల్లి రెవెన్యూ పరిధిలోని పాత సర్వే నంబరు 21లోని భూమిని తహసీల్దార్ అన్వర్, మైనింగ్ ఏడీ సత్యనారాయణ పరిశీలించారు. ఇదే సర్వే నంబరులో 17.28 ఎకరాలకు సంబంధించిన టెనెన్సీ కేసు పెండింగ్‌లో ఉందని హైకోర్టు ఆదేశించడంతో కొంత స్థలాన్ని పరిశీలించామని వారు తెలిపారు. కేసు పూర్వపరాలు త్వరలోనే తెలుసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున మట్టి తవ్వి సెల్లార్ తవ్వకాలు చేపట్టారని మైనింగ్ శాఖ ఏడీ సత్యనారయణ గుర్తించారు. అలాగే ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని.. వాటిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అనుమతులు ఇవ్వకుండా నిలిపివేయాలని కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వివరించారు. ఇదే సర్వే నంబరులో ఎలాంటి లావాదేవీలు జరగకుండా రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని పిటిషనర్ అధికారులను కోరినప్పటికి అధికారులు అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారని రక్షిత కౌలుదారులు ఆరోపించారు. పూర్తిస్థాయివిచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని వారి కుటుంబ సభ్యులు అధికారులను కోరుతున్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగవు



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.. ఎమ్మెల్యే కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే కేటీఆర్ వెనక్కి తీసుకుని.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేతల అహంకారాన్ని గమనించిన తెలంగాణ ప్రజలు, గత ఎన్నికల్లో ఓట్లతో బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అహంకారపు మాటలను, అనుచిత వాఖ్యలు చేయకుండా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నేతలు ఇలాగే వ్యవహరిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు వెంకటేశ్, హన్మానాయక్, జహంగీర్‌బాబా, భాస్కర్‌రెడ్డి, సత్యం, అశోక్, జహంగీర్‌అలీ, లక్ష్మయ్య, యాదయ్య, రాజేశ్, ఇమ్రాన్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు ఎల్మినేడులో ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ఎల్మినేడు గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నట్లు ఏఈ ఇంద్రాసేనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎల్మినేడు గ్రామ పంచాయతీ భవన ప్రారంభం కార్యక్రమానికి ఆయన హాజరవుతార్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

తలకొండపల్లి ఎస్ఐగా శ్రీకాంత్

తలకొండపల్లి: తలకొండపల్లి మండల నూతన ఎస్ఐగా ఎ.శ్రీకాంత్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. తలకొండపల్లి మండల పోలీస్ ఠాణాలో ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్రీను హైదరాబాద్ అత్తాపూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ జగద్గిరిగుట్టలో సెక్టార్–3 ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన శ్రీకాంత్ తలకొండపల్లి మండలానికి బదిలీపై రానున్నారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కుష్టువ్యాధిపై ఆందోళన వద్దు



యాచారం: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

యాచారం: కుష్టువ్యాధిపై భయాందోళన వద్దని పరీక్షలు చేయించుకుని మందులు వాడితే నివారణ సాధ్యమేనని యాచారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కుష్టువ్యాధి నివారణపై మంగళవారం యాచారంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలో ఎవరికైన కుష్టువ్యాధి సోకితే యాచారంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారికి ఆస్పత్రిలోనే ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. మందులు వాడితే నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నచూపు వద్దు..

తుర్కయంజాల్: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు చూడరాదని వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే సలువుగా బయటపడవచ్చని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ధరణి కుమార్ తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని బస్తీ దవాఖానాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు పోవద్దని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం అని, దీనికి అందరు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డా.శృతి తదితరులు పాల్గొన్నారు.

మందుల ద్వారా నిర్మూలించవచ్చు..

కడ్తాల్: జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రావిచేడ్‌లో మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్ కుష్టు వ్యాధి నిర్మూళన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టువ్యాధి నిర్మూలన అవగాహన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందుల ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూళించవచ్చని తెలిపారు. అవగాహన పక్షోత్సవాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది, కార్యదర్శి కృష్ణమాచారి, కృష్ణయ్య, సాయికుమార్ రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

- జెడ్పీటీసీలు అనురాధ, దశరథ్‌నాయక్, వెంకటేశ్
- జీపీ పాలకవర్గాలకు సన్మానం



తలకొండపల్లి: సర్పంచ్‌లు, పాలకవర్గాన్ని సన్మానించిన నాయకులు

ఆమనగల్లు: అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు చోటు ఇవ్వరాదని ఆమనగల్లు కడ్తాల జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. ఆమనగల్లు మండలం రాంనుంతలలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ సోన శ్రీనునాయక్‌తో కలిసి మంగళవారం వారు ప్రారంభించారు. అనంతరం పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచ్ సోన శ్రీనునాయక్, ఉపసర్పంచ్ సోని, వార్డు సభ్యులను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సరిత పంతునాయక్, లచ్చిరాంనాయక్, మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌నాయక్, హూమ్లానాయక్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ పత్యానాయక్, స్థానిక నాయకులు కృష్ణ, యాదగిరి, మంగ్యా, మమత, జంగమ్మ, పద్మ, నరేందర్, జగన్, శేఖర్, నారయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిర్మల ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నిర్మల ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సమక్షంలో సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘు, డీటీ సంతోష్, ఎంపీపీ, సర్పంచ్‌లు.. కుమార్, కిష్టమ్మ, లలితమ్మ, స్వప్న, సత్రి, ఎల్లమ్మ, గోపాల్, చంద్రయ్య, ఈశ్వర్‌నాయక్, శ్రీశైలంగౌడ్, భాస్కర్‌రెడ్డి, రమేష్, రాజు, లక్ష్మన్‌నాయక్, జీరానాయక్, విజయ్‌రెడ్డి, కిషన్‌నాయక్, ఎంపీటీసీలు హేమరాజు, సరిత, గణేషుగుప్తా, నాయకులు పాల్గొన్నారు.

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు..

కడ్తాల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తామని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ సమావేశానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గడిచిన ఐదు సంవత్సరాలుగా అధికారుల, ప్రజాప్రతినిధుల, గ్రామప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేసినట్లు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులను జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు చందోజీ, భాస్కర్‌రెడ్డి, లాయక్‌అలీ, మల్లయ్య, భిక్షపతి తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు: రాంనుంతలలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అనురాధ